క్లుప్తంగా

ఘనంగా మల్లికార్జున ఉత్సవాలు



మరికల్: శ్రావణమాసం ముగింపు సందర్భంగా మరికల్‌లో సోమవారం ఘనంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరశైవ సంఘం ఆధ్వర్యంలో జల్దిబిందె ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామి విగ్రహానికి జల, పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వీరశైవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



మక్తల్: పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు కళాశాల విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. 2025–26 మొదటి సంవత్సరం విద్యార్థులకు రెండో, మూడో సంవత్సరం విద్యార్థులకు ఘనంగా ఆహ్వానం పలుకుతూ కళాశాల విషయం మాట్లాడారు. అధ్యాపకుల బృందం పనితీరును కొనియాడారు. ప్రిన్సిపాల్ నారాయణగౌడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి క్రమశిక్షణ తప్పని సరిగా ఉంటే భవిష్యత్ ముందుకు పోతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు హరిచంద్ర, తిరుపతి, రమేష్‌గౌడ్, లింగప్ప, సులోచన, రాజేశ్వరి, నాగేంద్రమ్మ, ప్రదీప్‌కుమార్, మహేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలపై అవగాహన

కోస్గి రూరల్: వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడుదామని ప్రధానోపాధ్యాయులు జనార్దన్ అన్నారు. సోమవారం మండలంలోని మీర్జాపూర్ ఉన్నత పాఠశాలలో మట్టి గణపయ్య తయారీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిద్రాములు, త్రిగుణ, భీమయ్య, సంతోష్, మల్లయ్య, అహ్మద్‌పాషా ఉన్నారు.

రోబోటిక్స్‌పై శిక్షణ



నారాయణపేట రూరల్: సోహం అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక స్ఫూర్తి డిగ్రీ కాలేజీలో సోమవారం నిర్వహించిన రోబోటిక్స్ శిక్షణ విజయవంతమైంది. 51 మంది బాలికలు, 18 మంది బాలురతో కలిపి మొత్తం 69కి రోబోటిక్స్ ప్రాథమిక సూత్రాలు, హార్డ్‌వేర్ అంశాలు, ప్రాజెక్ట్ డిజైన్ మరియు నిర్మాణం వంటి కీలక అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపాల్ పద్మ మాట్లాడుతూ గతంలో కాలేజీ విద్యార్థులు నేర్చుకున్న రోబోటిక్స్ పరిజ్ఞానాన్ని జాజాపూర్ స్కూల్ విద్యార్థులకు బోధించడం ద్వారా స్ఫూర్తిదాయక పాత్ర పోషించగా, ఈ ఏడాది కూడా అదే ఉత్సాహంతో జిల్లా కేంద్ర ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ అందించేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. ఈ విధంగా, విద్యార్థులు తమ అభ్యాసాన్ని బలోపేతం చేసుకుంటూనే, పాఠశాల విద్యార్థులకు సాంకేతిక విజ్ఞానం అందించేందుకు వేదిక అవుతున్నారు. ఇలాంటి కార్యక్రమాలకు ఆ సంస్థ స్పాన్సర్‌గా మద్దతు అందించి తెలంగాణ రాష్ట్రాన్ని రోబోటిక్స్ విద్యలో ఆదర్శంగా తీర్చిదిద్దడంలో సోహం అకాడమీ కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

ధన్వాడ: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను ధన్వాడ పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని కొండాపూర్‌లో సోమవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు ఇసుక తరలిస్తున్న టిప్పర్ అడ్డురావడంతో తనిఖీ చేశారు. ఇసుకకు కోయిల్‌కొండ వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశారు. అక్రమంగా ఇసుక తరలిస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

వానరంపై కుక్కల దాడి

ఊట్కూరు: మండల కేంద్రంలో వానరంపై కుక్కలు దాడి చేయడంతో మృతి చెందగా, గ్రామస్తులు అంత్యక్రియలు చేపట్టిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. సోమవారం ఉదయం వివేకానంద చౌరస్తాలో సుమారు 20 వీధి కుక్కలు వానరంపై మూకుమ్మడిగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. ఆ వైపున వెళ్తున్న ప్రజలు కుక్కలను ఎంత తరిమి కొట్టినా వదలలేదు. దీంతో వానరం అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న కొంతమంది యువకులు వానరాన్ని పాడేపై తీసుకెళ్లి గ్రామ శివారులో జేసీబీ సహాయంతో దహనం చేశారు. అధికారులు స్పందించి కుక్కలను గ్రామం నుంచి తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాలకు నిధుల కొరత

- స్టేషనరీకి నిధుల కటకట
- విడుదల కాని నిర్వహణ గ్రాంట్
- సొంత డబ్బులు వెచ్చించి సౌకర్యాలు సమకూర్చుతున్న టీచర్లు



కోస్గి బాలుర ఉన్నత పాఠశాల

కోస్గి రూరల్: సర్కారు బడుల నిర్వాహణకు ప్రభుత్వం ఏడాదికి రెండు పర్యాయాలు స్కూల్ గ్రాంటు కింద నిధులు మంజూరు చేస్తుంది. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ ఇప్పటి వరకు స్టేషనరీ కొనుగోలుతో పాటు పాఠశాలల నిర్వాహణకు నిర్దేశించిన మెయింటెనెన్స్ స్కూల్ గ్రాంటు నిధులు విడుదల కాలేదు. ఫలితంగా రిజిస్టర్లు, డస్టర్లు, చాక్‌పీసుల కొనుగోలుకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. మరికొన్ని పాఠశాలల్లో టీచర్లే సొంత డబ్బులు వెచ్చించి కొంతమేర సౌకర్యాలు సమకూర్చుకుంటున్న సందర్భాలు ఉన్నాయి. గతంలో విద్యార్థుల సంఖ్యను బట్టి మెయింటెనెన్స్ స్కూల్ గ్రాంటులను ప్రభుత్వం విడుదల చేసేది. ఈ విద్యా సంవత్సరం బడులు తెరిచి మూడు నెలలు గడుస్తున్నా విధుల విడుదల చేసే విషయంలో ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.

మంజూరు కావాల్సిన నిధులు	
విద్యార్థుల సంఖ్య	రావాల్సిన మొత్తం
1 నుంచి 30 మంది	రూ. 10 వేలు
31 నుంచి 100 మంది	రూ. 25 వేలు
101 నుంచి 250 మంది	రూ. 50 వేలు
251 నుంచి 1000 మంది	రూ. 75 వేలు
1000 మంది కంటే ఎక్కువ ఉంటే	రూ. 1,00,000

ఉమ్మడి మండలంలోని పాఠశాలలు..

కోస్గి మండలంలోని మొత్తం 44 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 33, ప్రాథమికోన్నత పాఠశాలలు 2, ఉన్నత పాఠశాలలు 8, కేజీబీవీ 1 పాఠశాలలున్నాయి. గుండుమాల్ మండలంలో 24 పాఠశాలలున్నాయి. ప్రాథమిక పాఠశాలలు 18, ప్రాథమికోన్నత పాఠశాలలు 2, ఉన్నత పాఠశాలలు 2, సీఎంశ్రీ ఉన్నత పాఠశాల 1, పీఎంశ్రీ మాడల్ స్కూల్ 1 పాఠశాలలు ఉన్నాయి. ఉమ్మడి మండలాల పరిధిలోని పాఠశాలలో 6016 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వం ఏటా రెండు విడతలుగా అందించే గ్రాంట్‌తో పాఠశాలల్లో చాక్‌పీస్‌లు మొదలుకొని హాజరు రిజిస్టర్లు ఇతర అవసరమైన సామగ్రి ప్రయోగశాలల రసాయనాలను పాఠశాల నిధుల నుంచే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు నిధుల విడుదల చేయని కారణంగా బడుల నిర్వహణకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

నిధులు మంజూరు కాలేదు..



గతేడాది చివరి వరకు పాఠశాల నిర్వాహణ ని ధులు వచ్చాయి. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటి నుంచి ఇంకా ప్రభుత్వం నుంచి గ్రాంట్స్ విడుదల కాలేదు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు చూస్తున్నారు. సౌకర్యాలు కల్పిస్తున్నాం.

– శంకర్‌నాయక్, ఎంఈఓ, కోస్గి

రాబోయే రోజుల్లో క్రీడలకు మహర్దశ

- ఎమ్మెల్యే పర్ణికారెడ్డి



విద్యార్థినులతో ఖోఖో ఆడుతున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో రూ.26.60 లక్షలతో చేపట్టే గ్రౌండ్ లెవలింగ్ /అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణ పనులకు సోమవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నారాయణపేట క్రీడలకు, క్రీడాకారులకు నిలయమని, ఈ ప్రాంతానికి చెందిన ఎంతో మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో తమ క్రీడా ప్రతిభను చాటారన్నారు. క్రీడల శాఖ మంత్రిగా మన జిల్లాకు చెందిన డాక్టర్ వాకిటి శ్రీహరి ఉన్నారని, రాబోయే రోజుల్లో క్రీడలకు మహర్దశ వస్తుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్. లోకల్ బాడీ సంచిత్ గంగ్వార్, యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివారెడ్డి, ఆర్టీఏ మెంబర్ పోషల్ రాజేష్, పీఆర్ ఈ.ఈ హీర్యానాయక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్, డీవైఎస్‌ఓ వెంకటేష్, పీడీ సాయినాథ్, బాలరాజ్, అక్తర్ పాషా, దత్తు రావు పాల్గొన్నారు.

ఖోఖో ఆడిన ఎమ్మెల్యే

జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి పాఠశాల విద్యార్థినులతో కలిసి ఆటవిడుపుగా సరదాగా కాసేపు ఖోఖో ఆడి విద్యార్థినులలో ప్రోత్సాహాన్ని నింపారు. ఆటలో క్రీడా స్ఫూర్తిని చాటిన ఎమ్మెల్యే చివరి వరకు అవుట్ కాకపోవడం గమనార్హం.

ఇళ్ల మంజూరు పత్రాలు అందజేత

నారాయణపేట పట్టణంలో మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎమ్మెల్యే పర్ణికారెడ్డి సీవీఆర్ భవన్‌లో 33 మందికి మంజూరు పత్రాలు అందజేశారు.

కొత్త భవన నిర్మాణం చేపడుతాం

ధన్వాడ: శిథిలావస్థలకు చేరిన ధన్వాడ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని నూతనంగా నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను ఆమె తనిఖీ చేశారు. నూతన బిల్డింగ్ కోసం ఎస్టిమేషన్ వేసుకోని రావాలని ఏఈకి సూచించారు.

కస్తుర్బాలో ఆర్వోప్లాంట్ ప్రారంభం

మరికల్: మండలంలోని పస్పుల కేజీబీవీ పాఠశాలలో సూర్యచంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. సూర్యచంద్ర ఫౌండేషన్ అ ధినేత సూర్యమోహన్‌రెడ్డి సేవలు అభినందనీయమన్నారు.

హెల్త్‌క్యాంప్ వాల్‌పోస్టర్ విడుదల



వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న మంత్రి శ్రీహరి

మక్తల్: టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో జిల్లాలోని జర్నలిస్ట్ కుటుంబాలకు నిర్వహిస్తున్న ఉచిత హెల్త్ క్యాంప్ వాల్ పోస్టర్‌ను మంత్రి వాకిటి శ్రీహరి మక్తల్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కే.నారాయణరెడ్డి, హెల్త్ కన్వీనర్ సంజీవ్ ప్రకాష్ మాట్లాడారు. ఈ నెల 30న శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు నారాయణపేట పట్టణంలోని ఎస్ ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో ఉంటుందని తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట సహకారంతో హైదరాబాద్ యశోధ ఆస్పత్రి (మలక్ పేట్) వైద్య బృందం హాజరై కార్డియాలజీ, ఆర్థోపెడిక్, గైనకాలజీ, జనరల్ మెడిసిన్, న్యూరాలజీ విభాగాలతో పాటు బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో తదితర సర్వీసులు పొందవచ్చని తెలిపారు. జిల్లాలోని జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మాగనూరు, కృష్ణ మండల జర్నలిస్టులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్, రాష్ట్ర నాయకులు రఘు గణప, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన పుర కమిషనర్



మద్దూరు: పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను సోమవారం పుర కమిషనర్ శ్రీకాంత్ పరిశీలించారు. లబ్ధిదారులు నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. బేస్‌మెంట్ వరకు పూర్తి చేసుకోవాలని సూచించారు. బిల్లులు రావాలంటే నిబంధనల మేరకు ఇంటి నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఇంకా పనులు మొదలు పెట్టని వారికి వెంటనే పనులు ప్రారంభించాలన్నారు.

ఉపకరణాల గుర్తింపు శిబిరం విజయవంతం



మాట్లాడుతున్న సీఎంఓ రాజేంద్రకుమార్

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం సమగ్ర శిక్ష, భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కల్గిన విద్యార్థులకు అవసరమైన ఉపకరణాల గుర్తింపు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. సీఎంఓ రాజేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను విద్యార్థులకు వినియోగించి వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచటంలో తల్లిదండ్రులు చొరవ చూపించాలని కోరారు. కార్యక్రమంలో హలీం కోసం ప్రతినిధులు విద్యార్థుల యొక్క అవసరాలను బట్టి వారికి కావల్సిన కృత్రిమ పరికరాలు ఉపకరణాలను తయారు చేయడానికి కొలత తీసుకున్నారు. శిబిరంలో 96 మంది దివ్యాంగులు కృత్రిమ అవయవాల కోసం ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీ, యాదయ్య శెట్టి, దత్తురావు, ఐఈఆర్పీలు, దివ్యాంగులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీపీ మండల్‌కు ఘన నివాళి



కోస్గి: బిహార్ మాజీ సీఎం జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ బిందేష్ ప్రసాద్ మండల్ 107వ జయంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు గుర్రం హన్మంతు యాదవ్ మాట్లాడారు. 1978లో భారత రాష్ట్రపతి బిందేష్ ప్రసాద్‌ను జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌గా నియమించగా, ఆయన బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై నివేదిక ఇచ్చినా నేటికీ ఏ ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. బీసీల అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఇందులో బీసీ, యాదవ సంఘాల ప్రతినిధులు నర్సింహులు, ఎర్ర వెంకటయ్య, గోపాల్ పాల్గొన్నారు.

భూముల అన్యాక్రాంతంపై విచారణ చేయాలి



కృష్ణా: మండలంలోని ప్రభుత్వ అసైండ్ భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటిపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని కోరుతూ సోమవారం బీజేపీ మండల నాయకులు తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు నల్లె నర్సప్ప మాట్లాడుతూ మండలంలోని కృష్ణానది తీరంలో అసైండ్ భూములను స్థానికేతరులైన భూస్వాములు స్వాధీనం చేసుకున్నారని, ఆ భూమిని తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. గుర్జాల్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 24లో 29 ఎకరాలు, మురహర్‌దొడ్డి శివారులోని సర్వే నంబర్ 169లో ఓ అధికారి స్వాధీనం చేసుకున్నట్లు ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిజమైన పట్టదారులకు ఆ భూములను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మజ్జిగ సురేష్, రాఘవేంద్ర, డీకే కిష్టప్ప, తిమ్మప్ప, ఆంజనేయులు, హన్మంతు రాయ, మల్లేష్ పాల్గొన్నారు.

పర్యావరణహిత అలవాట్లు అలవర్చుకోవాలి



ధన్వాడ: ప్రతి విద్యార్థి రోజు పర్యావరణహిత అలవాట్లు అలవరుచుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బాలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ ఆధ్వర్యంలో యంగ్ ఎర్త్ లీడర్స్ పోగ్రాంను నిర్వహించారు. కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ ప్రణయ్‌కుమార్, జీసీడీఓ నర్మద, ప్రిన్సిపాల్ గంగమ్మ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలకు నిధులు కేటాయించాలి

నారాయణపేట క్రైం: వినాయక చవితి, నవరాత్రి ఉత్సవాలకు గ్రామంలో రోడ్లు, వీధిలైట్లు వంటి మౌలిక సదుపాయాల ఏర్పాట్లకు తక్షణ నిధులు మంజూరు చేయాలని ఊట్కూర్ ఉమ్మడి గణేష్ ఉత్సవ సమితి సభ్యులు సోమవారం కలెక్టర్‌కు వినతి అందజేశారు. కలెక్టర్ స్పందించి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బాల్ రెడ్డి, ఎం.భాస్కర్, సూర్య ప్రకాశ్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అరవింద్ ఆర్య, ఎం.భరత్, కోండన్ గోపాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విగ్నేష్ ఉన్నారు.


రైతు మహాసభలకు తరలిన నాయకులు

మద్దూరు: రైతంగా సమస్యల పరిష్కారం కో సం మహబూబ్‌నగర్‌లో ఏఐయూకేఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఐక్య రైతు మహాసభలకు మండలంలోని అప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రై తులు, రైతు కూలీలు సోమవారం తరలివెళ్లా రు. ఐక్య రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు న ర్సింహులు, శ్రీహరి, అంజి, మొగులప్ప, హన్మప్ప ఉన్నారు.

యూరియా అందించాలి

కొత్తపల్లి: రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలని బీజేపీ మండల నాయకులు సోమవారం తహసీల్దార్ జయరాములుకు వినతిపత్రం అందజేశారు. పంటలకు సకాలంలో యూరియా అందించాలని బీజేపీ అధ్యక్షుడు కేశవరెడ్డి కోరారు.

రూ.18 వేల వేతనం ఇవ్వాలి



నారాయణపేట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాలమణిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కేంద్రంలో మున్సిపల్ పార్కు దగ్గర పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పుంజనూరు ఆంజనేయులు, ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి గౌరమ్మ, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన నాయకులు

నర్వ: కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన నర్వ మండల నాయకులు సోమవారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీజేపీ నాయకులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఎంపీ డీకే అరుణ సమక్షంలో బీజేపీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అజిత్‌సింహారెడ్డి, బల్‌రాంరెడ్డి, మహిళా నాయకురాలు లలితమ్మ, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్ రావు, విజయ్‌రామ్, తదితరులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నారాయణపేట క్రైం: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం నారాయణపేట పట్టణంలోని పాతగంజ వద్ద చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. సరిహద్దు కర్ణాటక లోని గురుమిట్కల్ మండలం నస్లయ్ గ్రామానికి చెందిన గొడుగు శివ(40) హైదరాబాద్‌లోని హోటల్లో పని చేసేవాడు. నాలుగు రోజుల క్రితం తన సొంత గ్రామం కర్ణాటక నస్లయ్‌కి వచ్చాడు. ఈ క్రమంలో అతనికి తాగుడు వ్యసనం ఉండేది. ఈనెల 20న గొడుగు శివ నారాయణపేటకు వెళ్లాడు. మళ్లీ తిరిగి ఇంటికి రాలేదు. సోమవారం మధ్యాహ్నం అదే గ్రామానికి చెందిన జగ్గప్ప పాత గంజ్ వద్ద శివ పడిఉండడాన్ని చూసి అతని భార్య రాధమ్మకు చెప్పాడు. పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పది స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

పీహెచ్‌సీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



ఓపీ పేషెంట్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

దామరగిద్ద: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై కలెక్టర్ సిక్తా పట్నాయక్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కాన్పుల కోసం వచ్చే వారిలో హైరిస్క్, సాధారణ ప్రసవాల వివరాలపై వైద్యురాలు ఐశ్వర్యను అడిగి తెలుసుకున్నారు. ఈడీడీ క్యాలండర్‌లో ప్రసవాలు తదితర పూర్తి వివరాలను నమోదు చేయాలని సూచించారు. రోజు వారి ఓపీ వివరాలు, ఎలాంటి రుగ్మతలతో వస్తున్నారని, సీజన్ల పట్ల ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. ఓ వృద్ధురాలితో మాట్లాడి ఎలాంటి వైద్యం అందించారని ఆరా తీశారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రానికి తరలించే ఏర్పాటు చేయాలని సూచించారు. తహసీల్దార్ తిరుపతయ్య, ఎంపీడీఓ సాయిలక్ష్మి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం ప్రారంభించిన కలెక్టర్

నారాయణపేట: విశ్వబంధుత్వ దినోత్సవం, రాజయోగిని దాది ప్రకాశమణి 18వ పుణ్యస్మృతి దినం సందర్భంగా దేశవ్యాప్తంగా మెగా రక్తదాన శిబిరంలో భాగంగా ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరియ విశ్వవిద్యాలయం నారాయణపేటలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి వారి సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీ ఆదిత్య గౌడ్, లయన్స్ క్లబ్ సభ్యులు ఆత్మరామ్, భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రాజ్ కుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి బ్రహ్మకుమారి జయ, మరికల్ సేవా కేంద్ర నిర్వాహకులు బ్రహ్మకుమారి సునీత, బీకే అనసూయ, బ్రహ్మకుమారి, కుమారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు మట్టి గణపతి అందజేత

కోస్గి: కుమ్మరి సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు యాదయ్య చిట్టెమ్మదంపతులు కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాన్ని అందజేశారు.

ముందస్తు శాంతి సమావేశం



నారాయణ పేట క్రైం: జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉ నబీ పండుగల సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్ ఆర్ గార్డెన్ లో హిందూ, ముస్లిం మత పెద్దలు, అధికారులతో సీఐ శివ శంకర్ శాంతిసమావేశం నిర్వహించారు. రాబోయే పండుగలను ప్రజలంతా కులమతాలకతీతంగా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని, ఉత్సవాల ర్యాలీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాంతియుతంగా జరగాలని, అందుకు కావల్సిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. డీజే, అధిక శబ్దం చేసే పరికరాలకు అనుమతి లేదన్నారు. ర్యాలీలు ఊరేగింపులు నిర్ణీత సమయంలో మాత్రమే నిర్వహించాలన్నారు.కార్యక్రమంలో తహసీల్దార్, హిందూ, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ సమతుల్యత



నర్వ: మొక్కలు, వృక్షాలు, ప ర్యావరణ సమతుల్యతను కా పాడుతాయని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ అసిస్టెంట్ డైరెక్టర్ అన్నమయ్య అన్నారు. సోమవారం పెద్దకడ్మూర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్, యంగ్ ఎర్త్ లీడర్ షిప్ ప్రో గ్రాంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆయనను అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం పాఠశాల ఆవరణలో మెడిటేషన్(ఆయుర్వేద) ప్లాంటేషన్‌ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులకు మొక్కల ప్రాముఖ్యత, ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. గొంతు, చర్మ సమస్యల నివారణ కోసం, ఆయుర్వేద, సాంప్రదాయ వైద్య పద్ధతుల్లో వినియోగిస్తారన్నారు. తులసీ, కలబంద, పసుపు, అల్లం, మిరియాలు వంటివి మొక్కలు యాంటిబయోటిక్స్, ఆధునిక ఔషధాలకు ప్రత్యామ్నాయంగా ఉపయోపడతాయన్నా రు. విద్యార్థులు మొక్కల సంరక్షణ కోసం నిత్యం శ్రమించాలన్నారు. అనంతరం మొక్కలపై శ్రద్ధ వహించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం భాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి అర్జున్, ఉపాధ్యాయులు నవీన్, రాములు, చంద్రశేఖర్, మహేష్, శ్రీలేఖ, భాగ్యమ్మ, రమేష్ పాల్గొన్నారు.

కళాశాల తరలించే ఆలోచన మానుకోవాలి



మక్తల్: ప్రభుత్వ జూనియర్ కళాశా లను ప్రభుత్వ మైదానంలో నిర్మాణం చేపట్టాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం వివేకానంద చౌరస్తాలో విద్యార్థులు రాస్తారోకో నిర్వహించా రు. ఈ సందర్భంగా పలువురు ఏ బీవీపీ నాయకులు మాట్లాడుతూ మినీ స్టేడియం నిర్మాణానికి వేరే చోటు కేటాయించాలన్నారు. మైదానంలోనే కళాశాలను నిర్మాణం చేపట్టి, స్టేడియంను వేరోక చోటకు మార్చాలని డిమాండ్ చేశారు. మంత్రి వాకిటి శ్రీహరి, కలెక్టర్ సిక్తాపట్నాయక్‌లకు కళాశాల సమస్యలపై వినతి పత్రాలు అందజేసినా సమస్యలు పరిష్కారం చేయడంలేదని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్య లు వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర అధ్యక్షుడు అంజిరెడ్డి, కార్యవర్గ సభ్యుడు వినయ్, నరేష్, ఇందు, విజయలక్ష్మి, అభి, ఆనంద్, నవీన్, మీనాక్షి, సాయి, రంజిత్ పాల్గొన్నారు.

ప్రార్థనకు రాని ఉపాధ్యాయులు

మరికల్: మండల కేంద్రంలోని ఎంఈఓ విధులు నిర్వహిస్తున్న ఉర్దూ మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే ఉపాధ్యాయులు సమయ పాలన పాటించడం లేదు. సోమవారం ఉదయం 9.05 నిమిషాలకు పార్థన ప్రారంభం కాగా, ఒక్క ఉపాధ్యాయుడు కూడా రాలేదు. పార్ట్‌టైమ్ ఉపాధ్యాయురాలితో పాటు విద్యార్థులే తోటి విద్యార్థులకు పార్థన చేయించడం విశేషం. ఈ పాఠశాల్లో 57మంది విద్యార్థులు ఉండగా, 6గురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. వారు నిత్యం ఎప్పుడు వస్తోరో, ఎప్పుడు పోతారో తెలియదు. ఉర్దూ మీడియం పాఠశాలకు హెచ్‌ఎంగా వ్యవహరిస్తున్న ఎంఈఓ కూడా పాఠశాల సమయానికి రాకపోవడం ఏమిటని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. ప్రార్థన సమయంలో వందేమాతరం గీతం పడకుండా ముగించడంపై విమర్శలకు తావిస్తోంది. ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ఉర్దూ మీడియం పాఠశాల ఉపాధ్యాయులపై డీఈఓ చర్యలు తీసుకోవా లని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై ఎంఈఓ కరీముల్లా మాట్లాడుతూ ఈ రోజు ఒక్క రోజే ఆలస్యంగా వచ్చినట్లు చెప్పడం విశేషం.